## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

రామడుగు: మండలంలోని కొక్కెరకుంట గ్రామ రైజింగ్ సన్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘం సమన్వయంతో చేపల పెంపకంపై రెండ్రోజుల ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీలు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరయ్యేవారు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డ్, బ్యాంక్ ఖాతా, రేషన్ కార్డు, ఫొటోలు అందించాలన్నారు. 21 సంవత్సరం నుంచి 51 ఏళ్లు ఉన్నవారు అర్హులన్నారు. ఈనెల 18 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9989237381, 9573403782 నంబర్లలో సంప్రదించాలన్నారు.

### బ్లాంకెట్లు పంపిణీ



బ్లాంకెట్లు అందజేస్తున్న చందా పోశయ్య

రామడుగు: మండలకేంద్రానికి ఎన్నారై తోట సత్యం వారి తల్లిదండ్రులు తోట బుచ్చమ్మ-వెంకయ్య జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన 60 మంది నిరుపేదలకు బ్లాంకెట్స్‌ను పంపించగా గ్రామానికి చెందిన చందా పోశయ్య, అనిల్ అందజేశారు. ఈ సందర్భంగా బ్లాంకెట్స్‌ను అందజేసిన తోట సత్యంను గ్రామస్తులు అభినందించారు.

### నేటినుంచి మండల పూజలు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో 25వ మండల పూజ మహోత్సవ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమవుతుందని అయ్యప్ప సేవాసమితి కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు గొడపర్తి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో డిసెంబర్ 26 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### పదిమందిపై కేసు

జమ్మికుంట: భూవివాదంలో ఓ కుటుంబాన్ని దూషించినందుకు పది మందిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం పట్టణ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. పట్టణంలోని బొడికెల శ్రీనివాస్, కుటుంబ సభ్యులను అదే కాలనీకి చెందిన సమ్మయ్య, రాజేశ్వరి, వినయ్, మల్లయ్య, రాజయ్య, లక్ష్మి, రజిత, చిలుక రాజు, రమ్య, యుగేందర్ భూ వివాదంలో దూషించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పదిమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

**మరో ఐదుగురిపై**

భూ వివాదంలో దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బార్పటి రమేశ్ తెలిపారు. పట్టణంలోని బొడికెల రాజేశ్వరిపై అదే కాలనీకి చెందిన మిడిదొడ్డి సదానందం, శ్రీనివాస్, శ్రీధర్, శ్రీకాంత్, లక్ష్మి దాడికి పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

శంకరపట్నం : మండలంలోని కేశవపట్నంలో బుధవారం ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబాల్‌పూర్‌కు చెందిన రాణవేని శంకర్ (65) కేశవపట్నంలోని చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి చికెన్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో శంకర్‌కు తీవ్ర గాయాలుకాగా ఈఎమ్‌టీ సతీశ్ రెడ్డి ప్రథమ చికిత్స అందించి కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

# అటు భద్రత.. ఇటు అవగాహన

- గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన
- పోలింగ్ శాతం పెంపునకు పోలీసుల కవాతు



గంగాధరలో పోలీసుల కవాతు (ఫైల్)

గంగాధర: ఈనెల 30న రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఓటుహక్కు వినియోగం, ఎన్నికల నియమావళిపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. కోడ్ ఉల్లంఘించిన అధికార పార్టీతోపాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులపై కేసులు నమోదు చేశారు. పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలుపుతున్న రెవెన్యూ అధికారులు రానున్న ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ఈవీఎం (ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్)లో ఓటింగ్ విధానంపై గ్రామాల్లో అవగాహన కల్పించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఇప్పటికే గ్రామాల్లో బెల్ట్‌షాపులు మూసివేసి విక్రయదారులను బైండోవర్ చేస్తున్నారు. ఎన్నికల నియమావళిపై రాజకీయ నాయకులు, ప్రచారకర్తలకు అవగాహన కల్పిస్తున్నారు. పోలీసులు, కేంద్ర బలగాలు మండలంలో కవాతు నిర్వహిస్తున్నారు.

### నిర్భయంగా ఓటువేయాలి



అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి. ఎవరైనా భయభ్రాంతులకు గు రిచేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఓటుహక్కు వినియోగంలో ప్రజలకు మనోధైర్యం కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించాం. అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నాం.

– రవీందర్, సీఐ

### అనుమతి తీసుకోవాలి



అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజకీయ నాయకులు, ఇతరులెవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తాం. గ్రామాల్లో మద్యం విక్రయించొద్దు. అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు బహిరంగ సమావేశాలు నిర్వహించవద్దు, ప్రచార వాహనాలకు అనుమతులు తీసుకోవాలి. .

– పుల్ల అభిలాష్, ఎస్సై

### అవగాహన కల్పించాం



అర్హులైన ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలి. తమకు నచ్చిన ప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు ఓటుహక్కు ఎంతో దోహదపడుతుంది. ఇప్పటికే అర్హులైన యువతకు ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించాం. ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాం.

– రాజీవ్ మల్హోత్ర, ఎంపీడీవో



చెల్పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

### బాలల దినోత్సవం



రెవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో..

హుజూరాబాద్‌రూరల్ : మండలంలోని చెల్పూర్ గ్రామం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనురాధ, ఎస్ఎంసీ చైర్ పర్సన్ రజిత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని రెవెల్లి గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం పుల్లూరి ఆనందం, ఎస్ఎంసీ చైర్మన్ అంజయ్య, ఉపాధ్యాయులు కుమార్, రాజిరెడ్డి, అరుణశ్రీ, లలిత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



### ప్రమాదకరంగా రోడ్డు..

వీణవంక: మండలంలోని భేతిగల్-కనపర్తి గ్రామాల మధ్య రహదారి ప్రమాదకరంగా మారింది. వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్డు ధ్వంసమైంది. కనీసం ట్రాక్టర్లు వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏదైనా ప్రమాదం జరగకముందే రోడ్డు మరమ్మతు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### బీఎల్‌వోలకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

జమ్మికుంట: మండలకేంద్రంలో తహసీల్దార్ రజిని ఆధ్వర్యంలో బుధవారం పట్టణ, మండల పరిధిలోని బీఎల్‌వోలతో ఓటరు స్లిప్‌ల పంపిణీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంటింటా ఓటరు స్లిప్‌లను అందించాలన్నారు. విధులు సక్రమంగా నిర్వహించాలని బీఎల్‌వోలకు సూచించారు. సమావేశంలో ఆర్ఐ తిరుపతి, బీఎల్‌వోలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

హుజూరాబాద్ : పట్టణంలో నిర్మాణ దశలో ఆగిపోయిన అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అంబేద్కర్‌వాదులు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. బుధవారం పట్టణంలో వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణం కోసం పిల్లర్లు నిర్మించి వదిలేశారని, నిర్మాణం మాత్రం ముందుకుసాగడం లేదన్నారు. గత ఉపఎన్నిక సమయంలో మంత్రులు గంగుల కమలాకర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు నిధులు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బుచ్చయ్య, కొడూరి సమ్మయ్య, మాద్గుల ఓదెలు, అలేటి రవీందర్, మొలుగు రమేశ్, రాజు, ఎలగందుల వెంకటేశ్వర్లు, రాంసారయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

### ఫిషరీష్ అధ్యయనంతో ఉజ్వల భవిష్యత్



ఫిషరీష్ గురించి వివరిస్తున్న రాజు

కరీంనగర్ సిటీ: ఫిషరీష్ అధ్యయనంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎస్ఆర్ఆర్ కళాశాల జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు పర్లపల్లి రాజు తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల స్వతంత్ర ప్రతిపత్తిలో జంతుశాస్త్ర విభాగంలోని ఫిషరీస్ విద్యార్థులు కళాశాలలో గల నర్సరీ పాండులో చెన్నాస్ట్రేటర్స్ చేప పిల్లలను అధ్యాపకులతో కలిసి వదిలిపెట్టారు. ఆక్వా కల్చర్, ఆక్వా ఎక్స్‌పోర్ట్, ఓషోగ్రఫీ మెరిన్ బయో టెక్నాలజీ రంగాల్లో ఫిషరీస్ విద్యార్థులకు బాగుంటుందని తెలిపారు. పీజీ ఆ తర్వాత పరిశోధన వైపు ముందుకెళ్లాలని సూచించారు. డాక్టర్ కె.సురేందర్‌రెడ్డి, జీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ టి.మహేశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.సురేశ్‌కుమార్, అధ్యాపకులు సుమలత, సమత, రవళి , తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు సమన్వయంతో మెలగాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

- తిమ్మాపూర్ సీఐ ఇంద్రసేనా రెడ్డి

గన్నేరువరం: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా మండలకేంద్రంలో బుధవారం రాత్రి ఎస్సై చందా నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాల కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిమ్మాపూర్ సర్కిల్ సీఐ ఇంద్రసేనారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు కోడ్ అమల్లో ఉంటుందని, ప్రజల సమన్వయంతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

# ఎన్నికల నియమావళి పాటించాలి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

గన్నేరువరం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సీపీ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు మండలంలోని జంగపల్లి, మైలారం గ్రామాల్లో అనుమానాస్పద, సమస్యాత్మక ప్రాంతాల్లో బుధవారం రాత్రి ఎస్సై చందా నరసింహారావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికలు ముగిసేవరకు అవసరమైన చోట్ల తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# విద్యార్థులకు ఉపన్యాస పోటీలు



విద్యార్థులతో నిర్వాహకులు, తదితరులు

చొప్పదండి: సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 'మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర' అనే అంశంపై విద్యార్థులకు బుధవారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి వేణుకుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజిరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముల్కల కుమార్, ముద్దసాని శ్రీనివాస్, పుష్పలత, సావిత్రి దేవి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న చంద్రశేఖర్

కరీంనగర్ సిటీ: కరీంనగర్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోకెమిస్ట్రీ విభాగం అధ్యాపకుడు ఎ.చంద్రశేఖర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీకి బయోకెమిస్ట్రీ చెందిన ప్రొఫెసర్ కరుణ రూపాల అధికారి పర్యవేక్షణలో స్టడీస్ ఆన్ రీ కాంబినేట్ హ్యూమన్ టీం 23, మైటోకాండ్రియాల్ ప్రొటీన్ ఇంపోర్ట్ రిజెక్టర్ ఫంక్షన్ అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయన సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీలక్ష్మి, అధ్యాపకుల బృందం అభినందించారు.

# అందుబాటులో గన్నీ సంచులు

- ప్రతి కేంద్రానికి 10వేలు



తాహెర్ కొండాపూర్ కేంద్రంలో గన్నీ సంచులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ సహకార సంఘం ఆధ్వర్యంలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్, చెర్లభూత్కూర్, తాహెర్‌కొండాపూర్, బొమ్మకల్, దుబ్బపల్లి, జూబ్లీనగర్, నగునూరు, తీగలగుట్టపల్లి, ఆరెపల్లి, కమాన్‌పూర్, ఎలగందల్, నాగులమల్యాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ నెల 4 నుంచి కొన్ని కేంద్రాల్లో ధాన్యం తూకం వేసి రైసుమిల్లులకు తరలించగా.. మంగళవారం నుంచి మిగతా కేంద్రాల్లో కాంటా పెడుతున్నారు. ఆయా కేంద్రాలకు అవసరమైన గన్నీ సంచులను పంపించారు. ఒక్కో కేంద్రానికి 10వేల సంచులను అందుబాటులో ఉంచినట్లు సంఘం సీఈవో రమేశ్ తెలిపారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నట్లు వివరించారు.

# హోంగార్డుకు సన్మానం



సన్మానిస్తున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: కమిషనరేట్‌లోని హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ బి.సమ్మిరెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. కమిషనరేట్ కేంద్రంలో సీపీ అభిషేక్ మహంతి కార్యాలయంలో సమ్మిరెడ్డికి పూలమాలవేసి సత్కరించారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.5వేల చెక్కును అందజేశారు. విధుల్లో అంకితభావంతో 24 సంవత్సరాలు పోలీస్ శాఖకు సేవలందించి విరమణ పొందినందుకు సీపీ అభినందించారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ విద్యానగర్ ఫీడర్ పరిధిలోని విద్యానగర్, మామిడితోట, విజయదుర్గ కాలనీ, ప్రాంతాల్లో సరఫరా నిలిపేస్తున్నట్లు టౌన్2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు.

# ఉద్యోగ కల్పనలో బీజేపీ, బీఆర్ఎస్ విఫలం





ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ప్రణవ్



పార్టీలో చేరిన వారితో ప్రణవ్

- హుజూరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి వొడితెల ప్రణవ్

జమ్మికుంట/ఇల్లందకుంట/కమలాపూర్: రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలైన బీజేపీ, బీఆర్ఎస్ విఫలమయ్యాయని హుజూరాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ అన్నారు. బుధవారం జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల పరిధిలోని గండ్రపల్లి, నాగంపేట, శాయంపేట, బిజిగిరిషరీఫ్, పాతర్లపల్లి, సిరిసేడు, మర్రివానిపల్లి, చిన్నకోమటిపల్లి, ఇల్లందకుంట, శ్రీరాములపల్లి, తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 20 ఏళ్లు హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పనిచేసిన ఈటల రాజేందర్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని, నియోజకవర్గాన్ని అన్నిరంగల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బిజిగిరిషరీఫ్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కమలాపూర్ మండలంలోని దేశరాజుపల్లి ఉపసర్పంచ్ మిట్టపెల్లి సుభాష్, నలుగురు వార్డు సభ్యులతో పాటు 50మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి వొడితెల ప్రణవ్ కండువా కప్పి ఆహ్వానించారు. గూనిపర్తి ఉపసర్పంచ్ ముత్యాల సదానందం, మాజీ సర్పంచులు జనార్దన్, శ్రీలతరాజయ్య, పెరిక సంఘం మండల ఉపాధ్యక్షుడు మనోహర్‌లు చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు.